క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడాపోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. శుక్రవారం బాలికల, బాలుర, జెడ్పీహెచ్ఎస్‌తో పాటు ఆయా పాఠశాలలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈఓ వెంకటేశం తెలిపారు.

సహకార బ్యాంకుల్లో డిపాజిట్లపై అధిక వడ్డీ

పాపన్నపేట(మెదక్): సహకార బ్యాంకుల్లో డిపాజిట్లపై అత్యధికంగా వడ్డీ వస్తుందని పాపన్నపేట డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ కిషన్ అన్నారు. శుక్రవారం బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన డిపాజిట్ల సేకరణ వారోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డిపాజిట్ చేసిన మొత్తం ఎనిమిది, తొమ్మిదేళ్లలో రెట్టింపు అవుతుందన్నారు. సీనియర్ సిటీజన్లకు డిపాజిట్లపై అత్యధికంగా వడ్డీ చెల్లిస్తామని, దీనితో పాటు బీమా సదుపాయం ఉంటుందని అన్నారు. తమ బ్యాంకులో గృహ నిర్మాణం, విద్య, దీర్ఘకాలిక రుణాలివ్వడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల బలోపేతం, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, జహిరొద్దీన్, జిల్లా బాధ్యులు రమేశ్‌గౌడ్, చంద్రం, వసంత్, మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పథకాలకు దరఖాస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజాపాలనలో పలు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు గ్రామసభ లిస్టుల్లో లేకపోవడంతో శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో దరఖాస్తు చేసుకున్నారు. మూడు రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించిన అధికారులు అర్హులకు సంబంధించి పథకాలు మంజూరు రాకపోవడంతో ఆందోళనలు చేశారు. పథకాల్లో పేర్లు రాని వారు మరల దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో మండలంలోని గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం 58 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీఓ తిరుపతిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ స్వామి తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు రేషన్‌బియ్యం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పటాన్‌చెరువు రామచెంద్రపూర్‌కు చెందిన విజిలెన్స్ అధికారులు కౌడిపల్లి ధర్మాసాగర్ మధ్యలో 765డీ జాతీయ రహదారిపై ఆటోలో తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని మండల పౌర సరఫరాల అధికారి ప్రమీల, ఆర్ఐ శ్రీహరి ద్వారా పోలీసులకు అప్పగించారు. కాగా ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అకౌంట్ రద్దు చేయండి



ఇద్దరు పిల్లలతో ఏటీఎంలో బాలింత

శివ్వంపేట(నర్సాపూర్): తన బ్యాంకు ఖాతా రద్దు చేయాలని కోరుతూ బాలింత బ్యాంకు వద్ద అవస్థలు పడింది. మండల పరిధిలోని పాంబండ గ్రామానికి చెందిన రాణి శుక్రవారం శివ్వంపేటలోని ఇండియన్ బ్యాంకులో ఖాతాలో తన బ్యాంకు ఖాతాను రద్దు చేయాలని బ్యాంకు సిబ్బందిని కోరుతున్నా.. స్పందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ.. గ్యాస్ సబ్సిడీ డబ్బులు శివ్వంపేటలోని ఇండియన్ బ్యాంకు ఖాతాలో పడుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం తాను ఉంటున్న కల్లకల్ బ్యాంకు ఖాతాలో సబ్సిడీ డబ్బులు పడాలంటే, ఇక్కడి ఖాతాను రద్దు చేయాలని బ్యాంకు చుట్టూ తిరుగుతున్న బ్యాంకు సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయింది. బ్యాంకులో రద్దీ ఉండడంతో ఇద్దరు కూతుర్లతో ఏటీఎం క్యాబిన్‌లో ఉన్నానని, సంబంధిత అధికారులు స్పందించి తన సమస్య పరిష్కరించాలని వేడుకుంది.

అభ్యంతరాలతో ముగిసిన గ్రామసభలు



పెద్దశంకరంపేటలో గ్రామసభలో ప్రజలు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న పథకాలపై నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు పెద్దశంకరంపేట, వీరోజిపల్లి తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. పేటలో నిర్వహించిన గ్రామసభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. తమకు రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయభరోసా రాలేదని పలువురు ఆందోళనకు దిగారు. దీంతో గ్రామసభ రసాభాసగా మారింది. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఆర్ఎస్.సంతోష్, సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, భానుగౌడ్, విఠల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దుర్గాభవానీ, గ్రామకార్యదర్శి వెంకటరాములు పాల్గొన్నారు.

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలో చివరి రోజైన శుక్రవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలు అడుగడుగున అభ్యంతరాలతో గందరగోళ వాతావరణం మధ్య ముగిశాయి. మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో ఇల్లు లేని తమకు జాబితాలో పేరు రాకపోవడంతో పలువురు మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగంపేటలో జరిగిన గ్రామసభలో ఉపాధి హామీలో తాము పని చేసిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో తమ పేర్లు రాకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇళ్లు ఉన్న వారి పేర్లు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గ్రామసభను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అర్హులైన వారు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సముదాయించారు. అటు పైతరలోనూ వివేకమైన అభ్యంతరాలు గ్రామసభ ముందుకు వచ్చాయి.



రంగంపేటలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

దుర్గమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



దుర్గమ్మ సేవలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతారెడ్డి శుక్రవారం ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరిని దేవస్థానం సిబ్బంది సూర్య, శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు.

పులిహోరా ప్యాకింగ్ మిషన్ వితరణ

హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన శ్రీకాంత్, సుష్మ దంపతులు, కుమారుడు అయాన్‌సాయి, తల్లిదండ్రులు వీరభద్రయ్య, రేణుకలు కలిసి దుర్గమ్మ ఆలయానికి పులిహోర ప్యాకింగ్ మిషన్ బహూకరించారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు శంకర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆమె శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ లెటర్లు అందజేశారు. మండలంలోని లబ్ధిదారులకు రూ. మూడు లక్షల పది వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు మెదక్‌కు చెందిన సంతోష్‌రావుకు రూ.60వేల చెక్కును అందజేశారు. కౌడిపల్లి తండాకు చెందిన మేనికి రూ.రెండు లక్షల ఇన్సురెన్స్ చెక్కును అందించారు.

సంగాయిపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలో ఏడాది క్రితం మంగలి గోపాల్ ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. బాధిత కుటుంబానికి ట్రాన్స్‌కో ద్వారా నష్ట పరిహారం మంజూరైంది. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతారెడ్డి మరణించిన వ్యక్తి భార్య కమలకు రూ.50 వేల చెక్కును, రూ.4.50 లక్షల విలువ గల బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ మహమూద్, మాజీ ఎంపీపీ మంజుల, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రాజాగౌడ్, సాయిబాబాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, రవితేజ రెడ్డి, ప్రవీణ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రెండు నెలలుగా నీరు లీకేజీ



రోడ్డుపై పారుతున్న నీరు, తాత్కాలిక మరమ్మతులతో కూడలిలో పాడైన రోడ్డు

నర్సాపూర్: పట్టణంలోని శివాలయం వెనక ఉన్న కూడలి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పైపులైన్ రెండు నెలలుగా లీకవుతున్నా.. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడం లేదని చెప్పారు. గతంలో రోడ్డును తవ్వి పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతు పనులు చేయడంతో చౌరస్తాలో రోడ్డు పాడై మట్టి దిబ్బగా తయారైందన్నారు. కూడలిలో రోడ్డు పాడవడంతో కూడలి మీదుగా వెళ్లాలంటే ఇబ్బందుల పాలవుతున్నామని వాహనదారులు తెలిపారు. భగీరథ పథకం నీరు సరఫరా అయ్యే సమయంలో పైపులైన్ ధ్వంసమైన ప్రాంతం నుంచి నీరు బయటకు వచ్చి రోడ్డు వెంట పారుతుందని, శుద్ధి చేసిన నీరు రోడ్డుపై వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపాలిటీ వాటర్ వర్క్స్ ఇన్‌చార్జి వినీత్‌ను వివరణ కోరగా.. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

మహాద్వారం గేటు ప్రారంభం



గేటు వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం అభివృద్ధికి సహకరిస్తున్న వారిపై అమ్మవారి కృప ఉంటుందని బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అన్నారు. శక్తిపీఠం ముఖద్వారాలకు యూఎస్‌లో స్థిరపడిన గూడూర్ వాసి పెద్దగొని సృజన రూ.లక్ష సొంత నిధులతో ఆలయం వద్ద నున్న రెండు ముఖద్వారాలకు గేట్లు ఏర్పాటు చేయించగా, శుక్రవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితుడు పురుశోత్తమ శర్మ, ఉమారాణి సూర్యకుమార్‌గౌడ్ దంపతులు, సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆచూకీ లభ్యం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో మల్లేశంను బయటకు తీసి దుస్తులు తొడుగుతున్న స్థానికులు

నర్సాపూర్: తప్పిపోయిన వ్యక్తి శుక్రవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో దొరికాడు. మెదక్ మండలంలోని అవుసులపల్లికి చెందిన నాగారం మల్లేశం ఈ నెల 17న నర్సాపూర్ ప్రాంతంలో తప్పిపోయాడని ఆయన కుటుంబ సభ్యులు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు పక్కన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైకప్పు సందులో నుంచి కొన్ని వేళ్ల బయటకు కన్పించడంతో బ్యాంకు సిబ్బంది గుర్తించి, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో ఆయన స్థానికుల సహాయంతో డ్రైనేజీ పైకప్పు తొలగించగా డ్రైనేజీలో అతన్ని బయటకు తీశారు. అనంతరం అతనికి దుస్తులు తెప్పించి వేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనితో వారు అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతన్ని తన కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ లింగం చెప్పారు.

సాగు విధానంపై అవగాహన



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ సాగు విధానంపై విద్యార్థులకు శుక్రవారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. శివ్వంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు వరి పంట సాగు విధానం గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. విద్యార్థులతో వరి నాట్లు వేయించారు. వ్యవసాయ పంటల సాగు గురించి ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించి పరిజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశంతో శివ్వంపేటలోని వ్యవసాయ పొలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ట్లు హెచ్ఎం బాలచంద్రం అన్నారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రంగాయపల్లిలో క్షేత్రస్థాయిలో వరినాట్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన మహిళా ఉపాధ్యాయురాలు శుక్రవారం గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. చదువు ప్రాముఖ్యత, బాలికల చదువు కోసం కృషి చేయాలని, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణజ్యోతి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ జోన్‌లో కలపాలి

నర్సాపూర్: మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని హోలియ దాసరి పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలపడంతో జిల్లా ప్రజలు చాలా ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చార్మినార్ జోన్‌లో కలపాలని తెలిపారు. కాగా ఎస్సీ 59 కులాల వర్గీకరణలో హోలియ దాసరి కులాన్ని ఏ గ్రూప్‌లో చేర్చాలని చెప్పారు. షెడ్యూల్ కులాలకు ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్లను 22 శాతానికి పెంచాలని కోరారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

మనోహరాబాద్(తూప్రాన్): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పద్మశాలీ అధ్యక్షుడు జయరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం గ్రామ పద్మశాలీ సంఘం కమిటీలను మండలాధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా కుమార్, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా పుట్ట వీరేశం, యూత్ విభాగం అధ్యక్షుడిగా వీరేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మాధవీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యాదగిరి, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, పద్మశాలీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి శుక్రవారం ఎల్ఈడీ లైట్లు అందజేశాడు. దీంతో గ్రామస్తులు పీఏసీఎస్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి భూమి విరాళం



దాత శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గౌడ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మించే రేణుకాఎల్లమ్మ ఆలయానికి ఎస్ఎస్ పేయింట్స్ కంపెనీ యజమాని శ్రీనివాస్‌గౌడ్ మూడుగుంటలు, అనంతరామాగౌడ్ అయిదుగుంటల భూమిని దానం చేసినట్లు గౌడసంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం గ్రామ గౌడసంఘం నాయకులు, మాజీ జెడ్పీటీసీ రామాగౌడ్, మాజీ ఎంపీటీసీలు శంకర్‌గౌడ్, కిషోర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎల్లమ్మ అలయం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆలయానికి భూమి దానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భూదాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, అంజాగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మెరుగైన ఫలితాలు



చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): యోగా, ధ్యానంతో విద్యార్థులు మానసిక ప్రశాంతతో మెరుగైన ఫలితాలు సాధించగలరని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు టెలిమనస్ కార్యక్రమంలో భాగంగా యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతీరోజు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతకు తోడు ఏకాగ్రతతో చదవగలరన్నారు. ఈ కార్యక్రమంలో టెలిమనస్ కౌన్సిలర్లు ప్రణీత, సుబూద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు

హవేళీఘణాపూర్(మెదక్): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హవేళీఘణాపూర్ ఎంజేపీ బాలికల పాఠశాలలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, విధులు, బాల్య వివాహాల నిర్మూలనపై సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అవగాహన కల్పించారు. తెలిసి తెలియని వయసులో పొరపాట్లు జరగకుండా మంచి లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే 1098కు కాల్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మెదక్ సీడీపీఓ సంధ్య, ప్రిన్సిపాల్ విజయనిర్మల, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి



పెద్దశంకరంపేట(మెదక్): కస్తూర్బాలో బాలికలు



చేగుంట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చేగుంట(తూప్రాన్): బాలికలు ఉన్నతంగా చదువుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చేగుంట ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, పద్మ, స్వర్ణలత, వాణి, సుగుణల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బాలికలు ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. అలాగే కరీంనగర్ ఉన్నత పాఠశాలలో రమాకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో..

పెద్దశంకరంపేట(మెదక్): ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా కస్తూర్బా విద్యాలయంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కస్తూర్బా ప్రిన్సిపాల్ విజయ ఆధ్వర్యంలో బాలికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలు, చదువుకోవడం వల్ల కలిగే లాభాలపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి

మనోహరాబాద్(తూప్రాన్): బాలికలు ధైర్యంగా ఉండాలని ఎస్ఐ సుభాష్‌గౌడ్ సూచించారు. మండలంలోని కూచారంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో షీ టీంతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుల్ స్వరూప, కేజీబీవీ ఎస్ఓ గౌతమి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి**



శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పవన్ అన్నారు. శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి క్షయ నిర్ధారణ పరీక్షలు, 170 మందికి చాతి ఎక్సరేలు తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయిసౌమ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, నోడల్ టీం సభ్యులు మహేశ్‌కుమార్, రాజేశ్వర్, శ్రీకాంత్, రవి, తదితరులు ఉన్నారు.

◆ **మెనూ పాటించాలి**

శివ్వంపేట(నర్సాపూర్): మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం వడ్డించే కార్మికులు కచ్చితంగా ఆప్రాన్లు, హెడ్గేర్ వేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నిత్యం మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

◆ **నూతన పాత్రలు పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు మరింత నాణ్యతతో కూడిన ఆహారం అందించేందుకు నూతన వంట పాత్రలు పంపిణీ చేశామని ఎంఈఓ పుష్పవేణి తెలిపారు. శుక్రవారం మండలంలోని 43 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీపాఠశాలలకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లకు నూతన వంట పాత్రలు అందించినట్లు చెప్పారు. మండలంలోని చందంపేట, ధరిపల్లి, సూరారం, మిర్జాపల్లి, మడూర్ కాంప్లేక్స్ హెచ్ఎంలకు వంట పాత్రలు అందించారు. వంట పాత్రలు, అన్నం, కూరగాయలు వండేందుకు అవసరమైన పాత్రలు, స్టీల్ బకెట్లు ఇతర సామగ్రిని అందజేశామన్నారు.

◆ **ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా మురళి**

మనోహరాబాద్(తూప్రాన్): మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా కాళ్లకల్ గ్రామానికి చెందిన వర్గంటి మురళిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మాసాయిపేట యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలన్నారు.

◆ **పాఠశాలలో మాక్ పోలింగ్**



పాపన్నపేట(మెదక్): జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్‌ను విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు పోలింగ్‌లో ఓటింగ్ తీరు, సరళి తదితర వాటిపై సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు విశ్వనాథ్, రజిత, లక్ష్మి అవగాహన కల్పించి పోలింగ్ నిర్వహించారు. 480 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ **మంద కృష్ణ సభకు తరలిరండి**

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఈనెల 25న జరగాల్సిన ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ సమావేశం సిద్దిపేటకు మార్చామని సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ఉన్న సంఘం, అనుబంధ సంస్థల ప్రతినిధులు, మహిళా, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సిద్దిపేట తరలిరావాలని పిలుపునిచ్చారు.

◆ **కాంగ్రెస్ నాయకులు నిరసన**

శివ్వంపేట(నర్సాపూర్): గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మెకు బీఆర్ఎస్ రంగు వేయడంపై కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ చౌరస్తా వద్ద నున్న గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు రంగులు వేయించారని, దిమ్మెకు బీఆర్ఎస్ రంగు వేయడం ఏంటని గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీను, భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు.